క్లుప్తంగా

సర్పంచి తండ్రికి ఎమ్మెల్యే అన్నా నివాళి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు సర్పంచ్ మొగుళ్లూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకుడు భీమయ్య యాదవ్ తండ్రి పుల్లయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు.. పుల్లయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, సచివాలయం కన్వీనర్ ఈశ్వర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, ముద్దర్ల శ్రీనివాసులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలపై చర్చించిన సెక్రటరీ



సమస్యలు తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

పెద్దదోర్నాల: ఆరోగ్య మిత్రల సమస్యలపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీ ఐవసీ భవనంలో గురువారం ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబుతో చర్చించినట్లు ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆరోగ్య మిత్రల సమస్యల గురించి, ఉద్యోగ భద్రత, జీతాల పెరుగుదల, క్యాడర్, తదితర విషయాలపై మాట్లాడినట్లు ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు మాట్లాడుతూ ఆరోగ్య మిత్రుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి జెడ్డా కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకురాలు బంగారు శ్రీ, రాష్ట్ర నాయకులు గోవిందు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గిద్దలూరు రూరల్: తప్పిపోయిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి అన్నారు. తప్పిపోయిన పిల్లల జాతీయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కొంగలవీడు రోడ్డు సచివాలయంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 1979 మే 25వ తేదీన న్యూయార్క్‌లో పాఠశాలకు వెళ్తున్న ఆరేళ్ల ఎటాన్ పాట్జ్ అనే బాలుడు అదృశ్యమయ్యాడు. ఎప్పటికీ ఛేదించలేని కేసుగా ఆ కేసు మిగిలిపోయింది. దేశంలోని అనేక మంది ప్రజలు కోపంతో రోడ్ల మీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. అందుకు గుర్తుగా తప్పిపోయిన పిల్లల జాతీయ దినోత్సవంగా జరుపుకుంటూ తప్పిపోయిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నపిల్లలు, అనాథలు రోడ్లపై కనిపిస్తే వారిని కోర్టులో మండల న్యాయసేవా సంస్థ వారికి తెలియజేస్తే వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవాదులు రవిప్రకాష్, పిచ్చయ్య యాదవ్, కోర్టు సిబ్బంది వరలక్ష్మి, మధు పాల్గొన్నారు.

నేడు డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కెఎస్‌పల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఉప్పలపాడులో శుక్రవారం ఉదయం 8 గంటలకు డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు



మార్కాపురం : వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కొనకనమిట్ల : వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మార్కాపురం టౌన్: సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాల ప్రజలకు అందించడంలో వలంటీర్ల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో వివిధ వార్డుల్లో సేవలందిస్తున్న వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేందుకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని వలంటీర్లకు సూచించారు. పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు రామలక్ష్మమ్మ, రంగలక్ష్మి, కరీముల్లా, బుశెట్టి నాగేశ్వరరావు, దూదేకుల ప్రసాద్, హర్షిత, ఉత్తమ్‌కుమార్, రోజ్‌లీడియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సైనికులు.. వలంటీర్లు

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వద్దకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ వలంటీర్లు ప్రజా సైనికులని జెడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గొట్లగట్టు, గరిమినపెంట పాతపాడు, గార్లదిన్నె సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నివాసాలు వేగవంతంగా నిర్మించుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న పేరయ్య

దర్శి: జగనన్న కాలనీల్లో గృహాలు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి పేరయ్య అన్నారు. దర్శి అర్బన్ లేఔట్ గృహాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ నిర్మాణాల్లో గృహాలకు ఉన్న చిన్న చిన్న సమస్యలు సచివాలయం సిబ్బంది పరిష్కారం చేసి వారి ఇబ్బందులను తీర్చాలని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ప్రతి గృహం క్షుణ్ణంగా పరిశీలించి నిర్మాణంలో సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు. వారికి చెల్లించాల్సిన బిల్లులకు సంబంధించిన జాబితాలు జాప్యం లేకుండా త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్ డీఈ నిరీక్షణరావు, ఏఈ షేక్ షాకీర్ బాషా, వర్క్‌ఇన్‌స్పెక్టర్ టి.కొండలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆర్.వీరబ్రహ్మాచారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు డి.సాయి, శివారెడ్డి, శ్రావణి, శివాణి, హనోక్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న పీడీ పేరయ్య

ముండ్లమూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ పేరయ్య అన్నారు. మండలంలోని తమ్మలూరు లేఔట్‌ను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 19 మందికి ఇళ్లు మంజూరు కాగా 10 మంది మాత్రమే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మాణ దశను బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. మిగిలిన వారు కూడా వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి పూర్తి చేసేందుకు సిబ్బంది వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయన వెంట డీఈ నిరీక్షణరావు, ఏఈ హనుమంతరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

పొదిలి రూరల్: పొదిలి మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. జువ్వలేరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన చాగంరెడ్డి పుల్లారెడ్డి, చాగంరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి చెందిన బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి.

అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

కంభం: అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా పనిచేయాలని సర్పంచ్ పల్నాటి బోడయ్య అన్నారు. గురువారం ఉదయం అర్బన్ కాలనీలోని 98, 173 అంగన్‌వాడీ కేంద్రాలను ఈఓపీఆర్డీ విజయలక్ష్మితో కలిసి ఆయన తనిఖీ చేశారు. 98వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు, స్టాక్‌లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు, గర్భిణులకు అందిస్తూ విధులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం కంభం-4 సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు యూనిఫాం కచ్చితంగా వేసుకొని రావాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు. కన్వీనర్ డిష్మున్నా, సిబ్బంది పాల్గొన్నారు.

పశు బీమాతో పాడి రైతులకు మేలు

తర్లుపాడు: వైఎస్సార్ పశు బీమా పథకం పాడి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పశువైద్యాధికారి ఎం.నందన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పశువులు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు పశుపోషకులు ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చని తెలిపారు. బీపీఎల్ లబ్ధిదారులు ప్రీమియంలో 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఒక్కో కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేయించుకునేందుకు అవకాశం ఉందని వివరించారు.

సాగు నీటి లభ్యతపై అవగాహన

పెద్దారవీడు: సాగు నీటి వినియోగం, భూగర్భ జలాల పెంపుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎఫర్ట్ ఈడీ జేవీ మోహన్‌రావు, రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం బాబూరావు తెలిపారు. మండలంలోని కంభంపాడు పంచాయతీ బోడిరెడ్డిపల్లెలో చెరువు, నీటి ట్యాంక్‌లను పరిశీలించిన అనంతరం నీటి లభ్యత అంశాలపై వారు ప్రజలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నీటి వనరులను గుర్తించడంతో పాటు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. చెరువు అభివృద్ధి పనుల ఆయకట్టు ఉపయోగాలు, పన్నుల గురించి వివరించారు. ఎఫర్ట్, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది వీఏఏ వస్తం నాయక్, ఈడబ్ల్యూఏ కె.శివ, పీసీ జగీషా, సునీల్, జగన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన రామనారాయణరెడ్డి

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఆంకాళమ్మ దేవాలయం మూలమలుపు వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏనుగులదిన్నెపాడు గ్రామానికి చెందిన ఏర్వ రామనారాయణరెడ్డి తన కుమారుడితో బద్వీడు చెర్లోపల్లె గ్రామం మీదుగా టీవీఎస్ వాహనంపై మార్కాపురం వెళ్తున్నారు. దోర్నాల నుంచి మార్కాపురం కారు వెళ్తోంది. ఆంకాళమ్మ దేవాలయం మూలమలుపు వద్దకు రాగానే టీవీఎస్ వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రులను మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాజీయే రాజ మార్గం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

దర్శి: కోర్టుల చుట్టూ తిరిగి కేసులు తేలే వరకు వేచి ఉండే కంటే రాజీ చేసుకుంటే రాజమార్గంగా ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌వీ ప్రసాద్ అన్నారు. ఇంటర్నేషనల్ చిల్డ్రన్ మిస్సింగ్ డే సందర్భంగా స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ కోర్టుకు అందరూ సమానమేనని చెప్పారు. బడి వయస్సు పిల్లలు బడిలోనే ఉండాలని సూచించారు. పిల్లలను ఇతర పనులకు వాడరాదని చెపారు. బాలికల పట్ల అన్యాయం జరిగితే కోర్టులు తీవ్రంగా శిక్షిస్తాయని హెచ్చరించారు. డీటీ రవిశంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిరెడ్డి, న్యాయవాదులు చెన్నకేశవులు, సురేష్ పాల్గొన్నారు.

టీ-ఎంసెట్‌లో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ



ప్రియ వర్షిత



నందిని

మార్కాపురం: గురువారం విడుదల చేసిన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో మార్కాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ విభాగంలో శ్రీసాధన కాలేజీ విద్యార్థులు ప్రియ వర్షిత 8,606వ ర్యాంక్, బైపీసీ విభాగంలో రాజరపు వెంకటవంశీ 8,995 ర్యాంక్ సాధించినట్లు డైరెక్టర్ జీఎల్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ పి.కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే బైపీసీ విభాగంలో జ్ఞానశ్రీ నీట్ అకాడమీ విద్యార్థులు టి.నందిని 5,148వ ర్యాంక్, షేక్ స్వబీరాచాంద్ 8,542 ర్యాంక్ సాధించినట్లు డైరెక్టర్ ఎం.మల్లికార్జున తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

తాళ్లూరు: బొద్దికూరపాడులో గురువారం సాయంత్రం కురిసిన గాలి, వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు, పలుచోట్ల రేకులు నెలకొరిగాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 15 విద్యుత్ స్తంభాల వరకు నెల కొరగడంతో విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది శ్రమిస్తున్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం, బీసీ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్.జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: ఉపాధి హామీ పనికి వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బురుజుపల్లె సమీపంలో గురువారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ముండ్లపాడు గ్రామానికి చెందిన 12 మంది కూలీలు గుండ్లమోటు వద్ద కాలువ అభివృద్ధి పనులు చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో అర్హులకు నూతనంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ దాసు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ సచివాలయాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, అందులో భాగంగా కార్డుదారుల్లో చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏటా రెండు సార్లు నూతనంగా రేషన్‌కార్డులు, పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మే చివరి నాటికి అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ దాసు వివరించారు.

అడ్మిషన్లకు ఆటంకం లేకుండా చూడాలి



సమీక్షిస్తున్న ఎంఈఓ సుబ్బయ్య

తాళ్లూరు: నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల అడ్మిషన్లకు ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చెయ్యాలని ఎంఈఓ జి.సుబ్బయ్య సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలో జరుగుతున్న నాడు-నేడు పనులపై ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్‌తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 30 పాఠశాలలు, అంగన్‌వాడీల్లో నాడు-నాడు పనులు జరుగుతున్నట్లు ఏఈ పి.గోపి చెప్పారు. ఆయా పాఠశాలల్లో నీటి వసతి, టాయిలెట్స్, తాత్కాలిక మరమ్మతులు, బోర్డుల ఏర్పాటు వంటి పది పనులు త్వరగా పూర్తి చెయ్యాలని ఎంఈఓ సుబ్బయ్య కోరారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి

కొనకనమిట్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సూపర్‌వైజర్లు, అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులకు వివరించాలని కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, బాలికలు చదువుకునేలా వారికి అవగాహన కలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢ నమ్మకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రధానపాత్ర పోషించాలన్నారు. బాలబాలికల హక్కులు, లింగ వివక్షపై వ్యతిరేక పోరాటం, లింగ నిర్ధారణ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సావిత్రి, ప్రసన్న, ఝాన్సీ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి

పొదిలి: బాల్య వివాహాలు అరికట్టేందుకు అధికారులతోపాటు కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సీడీపీఓ సుధామారుతి కోరారు. గురువారం స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు, కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే స్పందించటం ద్వారా వివాహం నిలుపుదల చేయవచ్చన్నారు. సూపర్‌వైజర్లు సావిత్రి, ప్రసన్న, ఝాన్సీ, ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం చూస్తున్నా

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఓ మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా గడప గడపకు అందుతున్నాయని, దీంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 2, 3 వార్డుల్లో చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించడంతో స్థానిక సమస్యలపై ఆరాతీశారు. కొన్ని సమస్యలను అక్కడే ఉన్న అధికారులకు చెప్పి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పథకాలు రావాలంటే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగేవారని మన ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే పథకాలన్నీ వాటంతట అవే లబ్ధిదారులకు అందే వ్యవస్థను జగనన్న ఏర్పాటు చేయడంతో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు అమలు చేయడం ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పేదలందరికీ ఇళ్లు కట్టించే బృహత్తర కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా యజ్ఞంలా సాగుతుండటంతో ప్రతిపక్షాలు భయంతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడి ప్రజల్లో చులకన అవుతున్నారన్నారు. ప్రజలందరూ వాస్తవాలను గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు.

➤ గడిచిన 75 ఏళ్లలో ఇన్ని సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వం అమలు చేయలేదని, రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ పనులు వేగంగా సాగుతున్నాయని, పట్టణంలో శాశ్వతంగా నీటి సమస్య తొలగించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అంబడిపుడి బాలచెన్నమ్మ, వార్డు ఇన్‌చార్జి పీవీ నాయుడు, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, వార్డు అధ్యక్షుడు శ్యాంసన్, స్థానిక నాయకులు లూకయ్య, రమణారెడ్డి, ఏసోబు, రమణ, దాసరిలక్ష్మి, అంజలి, రంగయ్యతో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న జగనన్నకు అండగా ఉండాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ఓ వృద్ధుడిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నీ నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి ఆశీర్వదించాలని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు తెలిపారు. తొలుత మండలంలోని పామూరుపల్లెలో వెలసిన శ్రీసాంబసదా శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధి పామూరుపల్లె, మిట్టమీదిపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే అన్నా 112వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజలకు వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల పుస్తకాలు ప్రజలకు అందించారు. నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలను ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తాళ్లూరులో ప్రజావేదిక

తాళ్లూరు: ఉపాధి హామీ పథకంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులకు సామాజిక తనిఖీలో గుర్తించిన లోపాలను గురువారం నిర్వహించిన ప్రజా వేదికలో అధికారుల బృందం వెల్లడించింది. డ్వామా పీడీ శీనారెడ్డి ప్రజా వేదికలో పాల్గొని ఆయా పనుల్లో కనుగొన్న అవకతవకలపై సమీక్షించారు. మండలంలో వివిధ శాఖల్లో రూ.7.76 కోట్ల వ్యయంతో 676 పనులు చేపట్టినట్లు ఎస్‌ఆర్‌పీ తులసీ నాయక్ తెలిపారు. అందులో 16 పంచాయతీల్లో గుర్తించిన లోపాలను డీఆర్‌పీలు సభ దృష్టికి తెచ్చారు. అందులో రూ. 18,798 రికవరీకి, రూ.30,218లు ఉన్నతాధికారులతో మరోసారి విచారణకు, రూ.70,499ల విలువైన పనులకు మళ్లీ కొలతల ప్రకారం చేయించాలని, రూ.3,500 పలువురి సిబ్బందికి జరిమానా పీడీ శీనారెడ్డి విధించారు. ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు పలు గ్రామాల్లో చెల్లించిన నీటి బిల్లులతో డ్రిప్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించినట్లు ఎస్‌ఆర్‌పీ తులసీనాయక్ చెప్పారు. రైతులు తమ సొంతగా ఏర్పాటు చేసుకున్నా సరే మొక్కలను బతికించి ఫలంలోకి తీసుకొస్తే ఆ బిల్లులు సక్రమంగా వినియోగంలోనికి వచ్చినట్లు గుర్తించాలని సూచించారు. సభలో జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ. వెంకటేశ్వరరెడ్డి, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సోము అనీల్‌కుమార్‌రెడ్డి, సర్పంచిలు మేకల చార్లెస్ సర్జన్, మారం ఇంద్రసేనారెడ్డి, వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, కేఎస్ శివలక్ష్మి, ఎం.బ్రహ్మారెడ్డి, ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి ఝాన్సీ, విజిలెన్స్ ఎస్‌ఏ వెంకట స్వామి, అంబుడ్స్‌మెన్ మీరావలి, ఏపీఓ మురళి, ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులకు ఉపాధి పని కల్పించాలి

పుల్లలచెరువు: అర్హులకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులకు పని కల్పించాలని చెబుతుంటే మండలంలోని కొన్ని గ్రామాల్లో అర్హులకు పని కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయని, కేవలం కొందరికి పని కల్పిస్తూ ఉండటం అన్యాయం అన్నారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటూ అర్హులకు పనులు కల్పించకపోతే జూన్‌లో వైపాలెంలో జరిగే కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కొలతల ప్రకారం పని చేయాలి

దొనకొండ: ఉపాధి పనులు ఉదయం 6 నుంచి 10 గంటల్లోపు ముగించుకుని కొలతల ప్రకారం పని చేసి మంచి వేతనాలు పొందాలని ఉపాధి ఏపీఓ టి.దేవయ్య సూచించారు. మండలంలోని పెదన్నపాలెం, దొనకొండ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు సూచనలు, సలహాలు అందించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నామని, వేసవిలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజు సగటు రూ.272 కూలి పడే విధంగా పని చేయాలన్నారు. వేతనాలు వెంటనే చెల్లించేలా సిబ్బందిని ఆదేశించారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీ సత్య సేవా సమితి మందిరంలో విద్యార్థులకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంపై వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సేవా సమితి ఆర్గనైజర్ తంగిరాల రామిరెడ్డి తెలిపారు. 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. శిక్షణ ఈ నెల 31 వరకు కొనసాగుతుందని, ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు క్లాసులు జరుగుతాయన్నారు. ఉదయం 7.45 గంటలకు విద్యార్థులకు అల్పాహారం ఉంటుందని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కంభం: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని స్థానిక ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో మేరీ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. సెక్షన్ ఆఫీసర్ ప్రభాకరరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, నీటిని పొదుపుగా వినియోగించుకొని ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. ప్రతిజ్ఞ చేశారు.